క్లుప్తంగా

ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు



ధర్మపురం గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజల భాగస్వామ్యంతో ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ధర్మపురం, ఈదుపురం, కొఠారీ, కేశుపురం, బూర్జపాడు గ్రామ పంచాయతీల్లో పర్యటించి గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. ప్రతీ గ్రామం నుంచి దాతలు ముందుకు వచ్చి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంతబొమ్మాళి: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన నౌపడ–వెంకటాపురం వెళ్లే రహదారిలో సెలకపేట సమీపంలో శనివారం చోటుచేసుకోగా.. సున్నాపల్లి గ్రామానికి చెందిన కొండాల గణేష్ గాయపడ్డారు. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేటలోని ఆలయానికి కుటుంబ సభ్యులతో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. సెలగపేట వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకోవడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన గణేశుని చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నౌపడ ఎస్సై నారాయణస్వామి తెలిపారు.

సాహితీ వేదిక అధ్యక్షుడుగా ధనుంజయరెడ్డి



ఇచ్ఛాపురం రూరల్: ఉమ్మడి శ్రీకాకుళం తెలుగు వెలుగు సాహితీ వేదిక జిల్లా అధ్యక్షుడుగా ఇచ్ఛాపురం మండలానికి చెందిన తిప్పన ధనంజయరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలొజు రాజ్‌కుమార్ శనివారం ప్రకటించారు. ప్రముఖ జానపద కళాకారుడుగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన ధనుంజయరెడ్డి మహతీ సాంస్కృతిక సేవా సంస్థ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈయన నియమాకం పట్ల ఇచ్ఛాపురం నియోజకవర్గం కళాకారుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న దృశ్యం

కవిటి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని వక్తలు అన్నారు. కవిటి బెహరావీధిలోని ఠాకూర్ అనుకూలచంద్ర సత్సంగ మందిరంలో పదో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురుదైవంగా భావించే ఠాకూర్ అనుకూలచంద్ర చిత్రపటాన్ని పట్టుకుని కవిటిలో ఊరేగించారు. అనంతరం భజనకాలక్షేపం, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బొడ్డపాడు నుంచి గడూరుకు బీటీ రోడ్డు



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్దానం వాసులు

పలాస: పలాస మండలం బొడ్డపాడు నుంచి వజ్రపుకొత్తూరు మండలం గడూరు వరకు బీటీ రోడ్డు మంజూరు చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ ఉద్దానం ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్యేకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్డును మంజూరు చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, ఉద్దానం యువకులు ఉన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

కాశీబుగ్గ: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు శనివారం పలాసలో సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా కన్వీనర్ రామానంద స్వామి ఆధ్వర్యంలో కాశీబుగ్గ పాతజాతీయ రహదారి భంకేశ్వరిమాత ఆలయ సమీపంలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. నాయకులు వైశ్యరాజు మోహనరాజు, కొర్రాయి బాలకృష్ణ, తమ్మినాన మాధవరావు, కొత్తకోట జనార్దనరావు, బూర్జిపేట హరికృష్ణ, ఉన్నారు.

సిబ్బంది కొరత
అందని సేవలు!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉన్న టెక్కలి రెవెన్యూ కార్యాలయం



వీఆర్ఓ లేని చాకిపల్లి గ్రామ సచివాలయం

టెక్కలి:

గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు అందజేయాల్సిన రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉన్న కొద్దిపాటి ఉద్యోగులపై పని భారం పడడంతో వివిధ రకాల రెవెన్యూ సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామస్థాయిలో గ్రామ సచివాలయాల ద్వారా సులువుగా నేరుగా ఇంటికే రెవెన్యూ సేవలు అందుకున్న ప్రజలకు ఇప్పుడు వీఆర్వోల కొరతతో రెవెన్యూ సేవల్లో తీవ్రమైన జాప్యం చోటు చేసుకుంటోంది. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

డివిజన్ కేంద్రంలో..

డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని తహసీల్దార్ కార్యాలయం పరిధిలో భారీగా వీఆర్వోల కొరత కనిపిస్తోంది. 20 గ్రామ సచివాలయాలకు 20 మంది అవసరం కాగా ప్రస్తుతానికి ఎనిమిదిమంది వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. అంతేకాకుండా తహసీల్దార్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. వీటితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వ్యక్తిగత సెలవులో ఉన్నారు. సీనియర్ సహాయకుల పోస్టు ఖాళీగా ఉంది. కార్యాలయ సూపరింటెండెంట్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభావంతో విద్యార్థులతో పాటు రైతులు, ఇతర రెవెన్యూ అవసరాల కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

–నందిగాం మండలంలో రెండు, సంతబొమ్మాళి మండలంలో మూడు, కోటబొమ్మాళిలో మూడు వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉండగా కొన్ని చోట్ల రాజకీయ వేధింపులు తాళలేక ఆయా స్థానాల్లో ఉద్యోగులు విధుల్లో చేరడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ ప్రజలకు కీలకంగా సేవలు అందజేయాల్సిన రెవెన్యూ శాఖలో క్షేత్ర స్థాయిలో వీఆర్వోల కొరతతో రెవెన్యూ సేవల్లో జాప్యం కనిపిస్తోంది.

ఇబ్బందులు పడుతున్నారు...



తలగాం పంచాయతీకి వీఆర్వో లేకపోవడంతో రెవెన్యూ సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు వారికి అవసరమైన సర్టిఫికెట్ల కోసం వీఆర్వోల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీఆర్వోలను నియమించాలి.

–పేడాడ రమేష్,
టెక్కలి వైస్ ఎంపీపీ, తలగాం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



టెక్కలి డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను భర్తీ చేయాలని ఇప్పటికే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కొన్ని చోట్ల ఇన్‌చార్జిలను నియమించాం. రెవెన్యూ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

–ఎం.కృష్ణమూర్తి,
ఆర్డీవో, టెక్కలి

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న అధికారులు

కంచిలి: మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి హ్యాక్ టు ది ఫ్యూచర్ కార్యక్రమంలో ప్రదర్శించిన ప్రాజెక్టుకు ఇన్నోవేషన్ అవార్డు వచ్చింది. దీనికి కృషి చేసిన ఐదుగురు విద్యార్థినులను ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో–1 ఎస్. శివరాంప్రసాద్‌లు శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. భవిష్యత్తులో కూడా మరెన్నో నూతన అన్వేషణలు చేసేలా విద్యార్థినులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బందికి సూచించారు. అంతకు ముందు ఇక్కడ నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్, సీఆర్పీలు ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలకు సత్కరిస్తున్న గిరిజన జేఏసీ నాయకులు

కాశీబుగ్గ: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని, అవార్డులు వరిస్తాయని జిల్లా గిరిజన జేఏసీ అధ్యక్షులు సవర రాంబాబు అన్నారు. పలాసలో ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు పొందిన సవర జగన్నాయకులు, సవర మోహనరావు, చిరంజీవి, సవర దావీదులను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు పెద్దింటి ఈశ్వర రావు, లోకేశ్వరరావు, సవర శ్రీరంగులు, చంద్రశేఖర్, రామారావు, సిద్దు, అంగదుడు, సీతమ్మ పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు హారం వితరణ



బంగారు హారాన్ని అందజేస్తున్న ఫాల్గుణరావు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి డిగొనపపుట్టుగ గ్రామానికి చెంది అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బెండి ఫాల్గుణరావు రెండు తులాల బంగారు హారాన్ని వితరణగా అందించారు. శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ సమక్షంలో హారాన్ని అందజేశారు.

కోదండ రామాలయ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న తిలక్ తదితరులు

టెక్కలి: టెక్కలి మండలం నరసింగపల్లిలో కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రౌతు జయమోహన్, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, స్థానిక నాయకులు పోలాకి వీరవసంత్ ఉన్నారు.

స్టాక్‌లో తేడాలుంటే 6–ఏ కేసులు తప్పవు

వజ్రపుకొత్తూరు: పౌరసరఫరాల దుకాణాల్లో ప్రజలకు అందిచాల్సిన సరుకుల్లో తేడాలు ఉంటే 6–ఏ కేసులు తప్పవని వజ్రపుకొత్తూరు ఉప తహసీల్దార్ మురళీక్రిష్ణ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని రేషన్ 15 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దేవునల్తాడలోని షాపును తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో ఉన్న సరకుకలకు గ్రౌండ్ లెవిల్ ఉన్న సరుకుల మధ్య తేడాను పరిశీలించారు. రేషన్ దుకాణాల వద్ద స్టాక్ బోర్డులు ఉంచాలని డీలర్లను ఆదేశించారు. డీలర్ల సంఘం ప్రతినిధులు బి.తవిటయ్య, ధనుంజయరావు ఉన్నారు.

ప్రింటర్ వితరణ

సోంపేట: పలాసపురం గ్రామానికి చెందిన గార రాజారావు తహసీల్దార్ కార్యాలయానికి ప్రింటర్‌ను వితరణగా శనివారం అందజేశారు. రాజారావు ఆంధ్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దాతను తహసీల్దార్ బి.అప్పలస్వామి అభినందించారు.

విగ్రహ ప్రతిష్ఠ



టెక్కలి మండలం నరసింగపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుతున్న కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాంతి కళ్యాణంతో పాటు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

–టెక్కలి

కమనీయం..కల్యాణం



కవిటి మండలం లొల్లపుట్టుగలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 44 తిరుక్కల్యాణ మహోత్సవాలలో భాగంగా రెండో రోజైన శనివారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ అనువంశిక అర్చకుడు అప్పలస్వామి, చక్రధర స్వామి ఆలయ అర్చకుడు రాజేష్‌స్వామిల పర్యవేక్షణలో ఆలయం 44 కల్యాణోత్సవాలు, 55వ వార్షికోత్సవాలలో భాగంగా సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చన, విశేష హోమాది పూజాధికాలు జరిగాయి.

–కవిటి

పాఠశాలల సందర్శన



అభ్యాసన సమార్థ్యాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా ఉపాధ్యాయులు బోధించాలని ఇచ్ఛాపురం ఎంఈవో–2 ఎస్.విశ్వనాథం అన్నారు. పి.శాసనాం ప్రాథమిక పాఠశాల, కె.శాసనాం, ఇచ్ఛాపురం పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పరీక్షలకు సన్నద్ధం కావాలని టెన్త్ విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎ.చిరంజీవి, విశ్వనాథం, ఎస్ఆర్పీ గణేష్‌లు ఉన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

పనుల పరిశీలన..



పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్లను పూర్తి నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని కంచిలి ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. జాడుపూడి పంచాయతీ పరిధి బసవపుట్టుగ గ్రామంలో ఉపాధి నిధులు రూ. 5.40 లక్షలు అంచనా వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. నిర్మాణం తర్వాత సకాలంలో వాటరింగ్ చేయాలని సూచించారు.

–కంచిలి

అప్పయ్యదొర సేవలు శ్లాఘనీయం



కాశీబుగ్గ: అప్పయ్యదొర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులుగా, టెక్కలి ఎమ్మెల్యేగా దివంగత హనుమంతు అప్పయ్యదొర చేసిన సేవలు శ్లాఘనీయమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అప్పయ్యదొర 90వ జయంతిని పలాసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పయ్యదొర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, పార్టీ నాయకుడు ఉంగ సాయికృష్ణ, జిల్లా కార్యదర్శి బడగల బాలచంద్రుడు, బమ్మిడి సంతోష్, అల్లు రమణ, మన్మథరావు, ఖగేష్‌దొర, ఎర్రయ్య, ముఖుంద పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: అప్పయ్యదొర జయంతి కార్యక్రమాన్ని బెండి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతు రామ్మోహన్ దొర, హెచ్.ముకుందరావు, బాలాజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలో మహా విష్ణువును సుందరంగా అలంకరించిన దృశ్యం



కవిటి: బెజ్జిపుట్టుగలో పూజలందుకున్న చక్రధరస్వామి



టెక్కలి: వైభవ వేంకటేశ్వర ఆలయంలో పూజలకు క్యూ కట్టిన భక్తజనం



టెక్కలి: లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఇచ్ఛాపురం టౌన్: పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



నందిగాం: సుబ్బమ్మపేటలోని లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కంచిలి:పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి



ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురంలో పూజలు అందుకున్న వేంకటేశ్వరస్వామి



సోంపేట: బెంకిలిలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు



మందస: పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి



కాశీబుగ్గ: నెమలికొండపైన ఉన్న విష్ణు ఆలయంలో అభిషేకాలకు బారులు తీరిన భక్తులు



నెమలికొండపైకి వస్తున్న భక్తులు

భీష్మ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో శనివారం ప్రత్యేకపూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకుంది. విష్ణుసహస్ర నామార్చన సహిత తులసీ అర్చన పూజలు, సత్యన్నారాయణస్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకాహం భజన కాలక్షేపాలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్